శీలం కోల్పోయిన
పాతికేళ్ళకు
న్యాయం కోసం
వచ్చిన ఆమెకు
జరిగిన న్యాయం?

గంటి రమాదేవి
కథ

# పరాజిత

రామ్మూర్తి ఆమె వైపు చూశాడు.

నలభై ఏళ్ళుంటాయి. జుట్టు అక్కడక్కడ నెరిసింది. నిర్మలమైన నీళ్ళ అడుగున వజ్రపు ముక్క తాలూకు కాంతిలా, ఆమె గడిచిపోయిన సంవత్సరాలలోని అందం లీలగా తెలుస్తోంది.

యవ్వనంలో ఆమె గొప్ప అందగత్తె అయివుంటుంది. కాలమనే క్రూరమృగం తన కరకు కోరలతో ఆ అందాన్ని సాధ్యమైనంతగా నాశనం చేసింది. అయినా కళ్ళలో ఆ మెరుపు, ఆమె గత కాలపు అందాన్ని చూచాయిగా చెప్తోంది.

"ఇన్స్పెక్టర్! నాకు మీ సాయం కావాలి?"

ఆమె కంఠం విచారంగా పలికింది.

"చెప్పండి!" అన్నాడు రామ్మూర్తి.

ఆమె గొంతు సవరించుకుని అంది.

"ఇద్దరు దుర్మార్గులు నా శీలాన్ని దోచుకున్నారు. నాపై అత్యాచారం చేశారు... ఆ పురుగుల్ని పట్టుకుని శిక్షించాలి!..."

రామ్మూర్తి ఆశ్చర్యపోయాడు. ఈ వయస్సు వున్న ఈమెను ఇద్దరు బలాత్కరించారా!... రామ్మూర్తి తన ఇరవై ఏళ్ళ సర్వీసుని మనోఫలకం మీదకు తెచ్చుకున్నాడు. ఎన్నో నేరాలు! ఎంతోమంది నేరస్తులు! డెబ్బయి ఏళ్ళ ముసలమ్మా, నాలుగేళ్ళ పసిపాపా అన్న విచక్షణ వుండదు నేరస్తుడికి.

నేరాలు, నేరస్తులు, కోర్టులు, విచారణలు, శిక్షలు రోజువారీ జీవితంలో ఓ భాగమైపోయింది రామ్మూర్తికి. మనస్సు మొద్దుబారి, స్పందన అనేది పోయింది....



నేరాలు వినే యంత్రంగా, పరిశోధన చేసే మరలా అయిపోయాడు.

"ఎప్పుడు జరిగింది?" పేపరు, కాగితం అందుకుంటూ అడిగాడు అన్నాడు రామ్మూర్తి.

"చాలా కాలమైంది.... కరెక్టుగా చెప్పాలంటే ఇరవై ఒక్క సంవత్సరాల క్రితం... నేనప్పుడు స్కూలు ఫైనలు

చదువుతున్నాను. ఇదే ఊళ్ళో... ఇప్పుడున్న 'బస్సు కాంప్లెక్సు' ఒకప్పుడు తాళ్ళతోపు స్కూలు ఊరికి దూరంగా ఉండేది....

సాయంత్రం స్కూలు వదిలిపెట్టగానే ఆ దారినే ఊళ్ళోకి వచ్చేదాన్ని.... ఆ రోజూ అలాగే వస్తున్నాను. తాటితోపుల్లో, క్రుంగుతున్న సూర్యకాంతి పల్చగా పడుతోంది... కాంపోజిట్ లెక్కల్లోని ఒక థీరమ్ గుర్తుచేసుకుంటూ వస్తున్నాను. ఇంతలో ఇద్దరు నామీద పడ్డారు. గట్టిగా ప్రతిఘటించాను.. కేకలు వేసాను... వాళ్ళిద్దరు!... నేను ఒక్కదాన్ని!...

చీకట్లు చిక్కనవుతున్న సమయాన, నేను బలహీనపడ్డాను... అంతే!... నేనన్యాయమై పోయాను!..."

రామ్మూర్తి ఆమె కష్టపడుతూ అన్నాడు.

"ఇన్నాళ్ళు పోలీస్ రిపోర్టు ఇవ్వకుండా ఎందుకూరుకున్నారు..?"

"కారణం వుంది.... ఆ సంఘటన తర్వాత నేను మళ్ళీ స్కూలుకెళ్ళలేదు. పరీక్ష ఫెయిలయ్యాను. పరీక్ష మొదటి తరగతి ప్యాసవాల్సిన నేను, పెద్ద చదువులు చదవాల్సిన నేను చదువాపేశాను..."

నాకు పెళ్ళిచేశారు పెద్దలు.

అదీ నా పరీక్షలాగే ఫెయిలైంది...

మొదటి రాత్రి జరిగిందంతా చెప్పేసాను, ఆ మనిషిని మోసం చెయ్యడానికి మనస్సంగీకరించక. అది నే చేసిన పొరపాటేమో!

ఆ తర్వాత ఇరవై ఏళ్ళు ఆ మనిషి, చేతిలో నరకయాతన అనుభవించాను. బుద్ధిమంతుడనుకున్న ఆ మనిషి, కసిగా, నిష్ఠురంగా, ఎవరెవ్వరిని ఎంతలా పాడైపోవాలో అంతగా పాడైపోయాడు. ఒకే ఇంట్లో రెండు శవాల్లా బతికాం ఇన్నాళ్ళూ. ఆనందం, చిరునవ్వు, రేపటి గురించి ఆశ, ఇవేవీ లేకుండా మట్టిబొమ్మల్లా జీవితం సాగించాం.... రెండు నెలలైంది. ఆ మనిషిపోయి.... నా బతుకు బుగ్గవడానికి కారణమైన ఆ మనుష్యులు, నా సంగతి, నాకు జరిగిన అన్యాయం సంగతి మర్చిపోయి హాయిగా, సరదాగా ఎక్కడో బతుకుతూనే వున్నారు...."

"ఆల్ రైట్!... ఇన్నాళ్ళయినా తర్వాత వాళ్ళను పట్టుకోవడం కష్టం... పట్టుకున్నా ఏ ఆధారాల్తో వాళ్ళను అరెస్టు చేయడం?..."

రామ్మూర్తి ఆలోచిస్తూ అన్నాడు.

"ఆధారాలున్నాయి... వాటి సాయంతో మీరు వాళ్ళను అరెస్టు చెయ్యొచ్చు..." అని ఆగి

"ఇన్స్పెక్టర్! వాళ్ళను పట్టుకోండి... నే ననుభవించిన నరకయాతన వాళ్ళకు చూపించండి..." కసిగా అంది ఆమె.

"తప్పకుండా అలాగే చేస్తాం... ముందు ఆ ఆధారాలేమిటో చూపించండి..." రామ్మూర్తి అన్నాడు. ఆమె పాత గుడ్డ సంచిలోంచి రెండు 'హార్స్ షూ' మార్కు అగ్గిపెట్టెలు తీసింది.... ఆ తర్వాత రెండు చిన్న కాగితం కవర్లు తీసింది. వాటిని రామ్మూర్తి ముందు టేబులు మీద పెట్టి అంది.

"ఈ అగ్గిపెట్టెలో వాళ్ళ తలవెంట్రుకలున్నాయి. పెనుగులాటలో నా చేత చిక్కినవి... ఇద్దరివి వేరేగా ఉన్నాయి.

వాటన్నిటికన్నా ముఖ్యమైనవి ఈ కాగితం కవర్లో ఉన్నాయి. అవి వాళ్ళ ఫోటోలు."

రామ్మూర్తి ఆ కాగితం కవర్లు అందుకుని చూశాడు.

పదిహేడు, పద్దెనిమిది సంవత్సరాల యువకులవి. చాలా పాతబడ్డాయి. ఏదో స్కూలు తాలూకు రబ్బర్ స్టాంప్... వెనక్కు తిరగేసి చూశాడు రామ్మూర్తి. మసగ్గా మసగ్గా ఉంది. ఫోటోస్టూడియో ముద్ర.

వాటిని టేబులు మీద పెట్టి అన్నాడు రామ్మూర్తి.

"ఈ ఫోటోలు, తల వెంట్రుకలు చాలా 'వీక్ క్లూస్!' వీటి మీద ఇంకా పరిశోధన చెయ్యాలి.... వీటిని నా దగ్గరుంచి, మీరు వెళ్ళండి... మీకు కబురు పంపుతాను."

"అంతకన్నా ముఖ్యమైన క్లూ ఇస్తాను... ఇన్స్పెక్టరు — మీకు ధైర్యం ఉందా?" అంది ఆమె సవాలు చేస్తున్నట్టు.

రామ్మూర్తికి కోపం వచ్చింది.

"చెప్పండి" అన్నాడు.

"మీ దగ్గరున్న ఫోటోల్లో ఉన్న వ్యక్తి ఈ ఊర్లో చాలా పెద్ద మనిషి."

"ఇంకా ఈ ఊరి పరిస్థితి నాకు తెలియదు. నే వచ్చి నెలరోజులే అయింది. అయినా సరే... మీరేం అనుమానించకండి... ఎంత పెద్దమనిషైనా సరే నేరస్థుడైతే విడిచి పెట్టేది లేదు" ధృఢంగా అన్నాడు రామ్మూర్తి.


"ఆయన పేరు దుర్గారావు.... పెద్ద పారిశ్రామికవేత్త... రాజకీయ నాయకుడు.... నాకు మొన్ననే తెలిసింది. పేపర్లో పడ్డ ఫోటోలో పోలికలు చూడగా, చూడగా నాకు తెలిసాయి..."అందామె అని

గుమ్మందాటి వెళ్ళిపోయింది.

* * *

దుర్గారైస్ మిల్ ఆవరణలో మోటారుసైకిల్ దిగాడు రామ్మూర్తి. తన 'స్ట్రేటజీ' ఏమిటో ముందే ఊహించుకున్నాడు.. తను ఫస్ట్ టైము ఈ దుర్గారావును చూడడం. ఈ ఊర్లో వున్న ప్రముఖుడిగా తనతో పరిచయం, దుర్గారావులో విస్మయాన్ని కలిగించదు... మాటల్లో దింపి ఈ దుర్గారావు చదువు సంధ్యలు, చిన్నతనం అంతా తెలుసుకోవాలి. అప్పుడు మరికొంత పరిశోధన చేసి, సైకలాజికల్ గా 'ఎటాక్'చేసి నిజం చెప్పించాలి!

దుర్గారావు ఆఫీసు సమీపించాడు



కంగారు

"చేతిమీద పడితే పుండుపడే యాసిడ్ ఏదిరా?" టీచర్ అడిగింది.

"హోట్లోవాళ్ళిక చివర ఆడుతోందికానీ.." నసిగాడు వేణూ

"అయితే వెంటనే ఉమ్మేయ్! అది గాఢగందకి కామ్లం!" కంగారుగా అంది టీచర్.

జోకర్ (హైద్రాబాద్)

రామ్మూర్తి. దుర్గారావు పర్సనల్ అసిస్టెంటు "ఇంటర్‌కాం"లో మాట్లాడాడు. రామ్మూర్తిని కూర్చోబెట్టి 'పర్పస్ ఆఫ్ విజిట్ సోషల్ కాల్' అని చెప్పాడు రామ్మూర్తి.

పది నిమిషాల తర్వాత రామ్మూర్తికి పిలుపు వచ్చింది.

లోపలికి అడుగుపెట్టాడు రామ్మూర్తి. విశాలమైన ఆఫీసు గది. చల్లగా ఏ.సి ఆహ్వానించింది.

"కమాన్ ఇన్స్‌పెక్టర్!" అని పలకరించాడు దుర్గారావు.

సిల్కు లాల్చీ, పట్టు పంచె, బంగారు ఫ్రేం కళ్లజోడు, హుందాగా, నిండుగా ఉన్నాడు దుర్గారావు. ఇలా ఉన్న పెద్ద మనిషి లేపేస్తా!

మాడగానే ఎంతో తెలిసిన ముఖంలా, ఎంతో పరిచయమున్న మనిషిలా అనిపించాడు రామ్మూర్తికి. కలుగులో పాములా ఆలోచన బయటకు రావడం లేదు" ఎక్కడ చూశాడు ఈ దుర్గారావును? బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కావడం లేదు.

"ఎస్! ఇన్స్‌పెక్టర్! థ్యాంక్స్ ఫర్ కాలింగ్! మీరీ ఊరుకు కొత్తగా వచ్చారా?"

దుర్గారావు మాట కూడా ఎక్కడో విన్నట్టుందే! ఎక్కడ?

ఆకారాలు మార్చుకుంటున్న నిర్జల మేఘాల్లా ఆలోచనలు...

దుర్గారావు సిగరెట్టు ఆఫర్ చేశాడు. తనొకటి వెలిగించి, సిగరెట్టు పొగరింగు సీలింగు వైపు వదిలాడు.

చిత్రమైన పెదవుల కదలిక సిగరెట్టు తాగేటప్పుడు ఎక్కడో దుర్గారావుతో తనకు పరిచయముంది. ఎక్కడై వుంటుంది?

ఏ.సి చల్లగాలిలో చెమటలు పట్టింది రామ్మూర్తికి. టోపీ తీసి టేబులు మీద పెట్టాడు.

అప్పుడు!!

దుర్గారావు నోట్లో సిగరెట్టు జారి కిందపడింది.

ఆశ్చర్యంగా అతని నోరు తెరుచుకుంది.

"మీరు... మీరు... నువ్వు... నువ్వు... రామ్మూర్తి కదూ...!" అన్నాడు ఆశ్చర్యంగా దుర్గారావు.

కటిక చీకటిలో హోరున కురిసే వానలో తళుక్కున మెరుపు మెరిసి లోకాన్ని ఒక క్షణం పగటి కాంతిలా మెరిపించినట్టు రామ్మూర్తి మెదడు చీకటి గుహలో తళుక్కున ఒక జ్ఞాపకం మెరిసింది.

"ఆ... మీరు... నువ్వు... అహో... నువ్వు కదూ.." అన్నాడు.

ఎవరి దారపు అంచు. దొరికిన సాలె పురుగుల్లా గూడు అల్లాయి వాళ్ళ మనస్సులు.

"ఆ... ఆ... ఎన్నాళ్ళకెన్నాళ్ళకు..." దుర్గారావు అన్నాడు.

"దుర్గారావంటే ఎవరో అనుకున్నాను..." రామ్మూర్తి అయోమయంగా అన్నాడు.

"అసలు పేరు వెంకట మహా దుర్గారావు... మధ్యలో ఈ 'మహా' పెద్ద ఎక్కువగా వుందని కుదించేసాను... ఇప్పుడు వ్యాపారంలో కొచ్చింతర్వాత పూర్తిపేరు దుర్గారావని స్థిరపడిపోయింది... మనం కలిసి ఎన్నాళ్ళయింది... ఇరవైఏళ్ళు... అబ్బ... ఆ రోజులు మళ్ళీ రావనుకో... మరీ ఆ

రోజా..." కళ్ళు మూసుకుని తన్మయత్వంలో రెండు క్షణాలాగి అన్నాడు.

"నీది పోలీసు డిపార్ట్‌మెంటు కదా! నీకు అంతగా అనిపించక పోవచ్చు..."

"ఏమిటది?" పరిహాసంగా అన్నాడు రామ్మూర్తి!

"ఆ నాటి సంఘటన... నీకు... నాకూ మాత్రం తెలిసినది..."

"ఎస్.ఎస్.ఎల్.సి పరీక్ష ఫీజు కట్టాల్సిన రోజు ఫోటోలు తీయించుకుని తాటి తోపులో నడుస్తున్నాం. అప్పుడు కనకాంబరం రంగు పట్టుపరికిణీ కట్టుకుని, ఎర్రగులాబీ వోణీ వేసుకుని, ఆకుపచ్చ జాకెట్టు తొడుక్కుని మెరుపుతీగలా, స్వర్గంలోంచి దిగొచ్చిన మేనకలా, లీల తాటితోపులో ఏదో ఆలపిస్తూ పోతూ ఉంది. లీల కావాలని, ఆమెను తాకాలని, ఆహ్లాదంలో ప్రయత్నించి పరుగెత్తి పోయిన మనం ఆ రోజు తెగించాం.

ఆ సంధ్యవేళ జరిగిన ఆ అనుభవం జీవితాంతం మరిచిపోలేం."

ఆగిపోయిన గడియారానికి 'కీ' ఇచ్చి మళ్లీ నడిపించినట్టు, రామ్మూర్తి మొద్దుబారిన మనస్సు మెల్లగా నడిచింది.

తన దగ్గరకు వచ్చింది లీలా?

తనని గుర్తుపట్టలేదేం?... బహుశా ఈ [illegible] ఇవి చేసుకుంటాయి [illegible]. మరి లీలని తనెందుకు గుర్తుపట్టలేదు. చిందర వందర ఆలోచనలో పడి, పడి గుర్తింపుకోల్పోయిన తన మనసు కారణం అయ్యుండొచ్చు. రామ్మూర్తి తన జేబులోంచి సుశీల ఇచ్చిన అగ్గిపెట్టెలు, ఫోటోలు తీశాడు.

"వెంకట్రావు" మన పెళ్ళినాటి తలంబ్రాలు... ఫోటోలు... చూడాలనుకుంటున్నావా?" నవ్వుతూ అన్నాడు రామ్మూర్తి.

ఆ ఫోటోలు చూసి విరగబడి నవ్వాడు మద్దారావు.

"ఏమిటి? మనవే? రెండు పుల్లలా ఎలా ఉన్నామో!... ఈ పెళ్ళి కథేమిటి?"

"ఆ తాటితోపు లీల ఇవ్వాళ నా ఆఫీసులో ఇచ్చింది."

మద్దారావు ముఖం పాలిపోయింది ముఖంలో రక్తం తోడేసినట్టుగా, ముఖం వాడిపోయింది.

కొన్ని క్షణాల్లో మద్దారావు మొహం తేరుకుంది.

ఆ అగ్గిపెట్టెలు చెత్తబుట్టలో వేశాడు రామ్మూర్తి.

మద్దారావు మొహంలో చిరునవ్వు వెన్నెలా మెరిసింది.

ఆ ఫోటోలు చింపి అదే చెత్తబుట్టలో వేశాడు రామ్మూర్తి.

* * *

ఊరికి దూరంగా, ఓ చిన్నగదిలో ఆశతో ఎదురు చూస్తోంది జీవచ్ఛవంలాంటి ఓ మనిషి. ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురుచూస్తోంది.

వెలుగు రేఖ కోసం ఎదురుచూస్తున్న ఆమెకు తెలీదు, సూర్యోదయం ఓ జీవిత కాలం ఆలస్యంగా వస్తున్నట్టు.